
నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జీడిమెట్ల: విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం జీడిమెట్ల పారిశ్రామికవాడలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందనిఅధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. జీడిమెట్ల ఫేజ్- 3, ఫేజ్- 5లోని ఫీడర్లలో మరమ్మతులు నిర్వహించనున్నారు. దీని కారణంగా మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుంది. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.

అన్నదానం

జగద్గిరిగుట్ట: చింతల్, శ్రీసాయి కాలనీలోని అభయ అంజనేయ, పోచమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హనుమాన్ అన్న ప్రసాద సేవా ట్రస్ట్ చైర్మన్ కన్నెగంటి లక్ష్మణ్, ప్రెసిడెంట్ కళ్యాణ్ రావు పాటిల్ ఆధ్వర్యంలో ప్రతీ వారం నిర్వహిస్తున్న అ అన్నదాన కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారమెప్పుడో!



సెయింట్ ఆన్స్ స్కూల్ సమీపంలో పొంగుతున్న డ్రైనేజీ

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ ఎస్‌సీఎల్ కాలనీ సెయింట్ ఆన్స్ స్కూల్ సమీపంలో డ్రైనేజీ సమస్య స్థానికులను పట్టి పీడిస్తోంది. నిత్యం రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడంలేదు.నిత్యం ఆ రోడ్డుపై డ్రైనేజీ పొంగిపొర్లడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వీధికుక్కలకు వ్యాక్సినేషన్



వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న బ్లూక్రాస్, దుండిగల్ మున్సిపల్ అధికారులు

దుండిగల్: బ్లూక్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం దుండిగల్ మున్సిపల్ పరిధిలో వీధి కుక్కలకు ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ సిబ్బంది పలు వార్డుల్లో కుక్కలను పట్టుకుని బ్లూక్రాస్ సిబ్బందికి అప్పగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ వీధి కుక్కల దాడుల ఘటనలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ ప్రభాకర్, వెటర్నరీ డాక్టర్ శైలజ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచందర్,, బ్లూక్రాస్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో జీడిమెట్ల పీఎస్‌కు మొదటిస్థానం



రివార్డు అందుకుంటున్న హోంగార్డు మోహన్

జీడిమెట్ల: ఈ నెలలో జరిగిన నేషనల్ లోక్ అదాలత్‌లో 161 కేసుల్ని పరిష్కరించి సైబరాబాద్ కమిషనరేట్‌లోనే జీడిమెట్ల పోలీసుస్టేషన్ మొదటి స్థానంలో నిలిచింది. ఈ మేరకు జీడిమెట్ల ఎస్‌హెచ్‌వో గడ్డం మల్లేష్‌తోపాటు పోలీస్ సిబ్బందిని బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్ అభినందించి రివార్డులు అందజేశారు. రివార్డులు అందుకున్నవారిలో హెడ్‌కానిస్టేబుల్ రాజశేఖర్, కానిస్టేబుళ్లు నాగయ్య, రవినాయక్, శ్రీకాంత్, హోంగార్డ్ మోహన్ ఉన్నారు. సిబ్బంది ఉత్సాహంగా పనిచేసేలా ప్రోత్సహించిన ఎస్‌హెచ్‌వో గడ్డం మల్లేష్‌ను డీసీపీ అభినందించారు. కార్యక్రమంలో బాలానగర్, కూకట్‌పల్లి ఏసీపీలు హన్మంతరావు, శ్రీనివాస్ ఉన్నారు.

ఘనంగా తిరుప్పావై సదస్సు



తిరుప్పావై సదస్సుకు హాజరైన భక్తజనం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం తిరుప్పావై సదస్సు జరిగింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన సదస్సులో వేద పండితులు తిరుప్పావై ప్రవచనాలు చేయగా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. మార్గశిర మాసంలో చేయాల్సిన పూజలు, గోదావరి కల్యాణం తదితర విషయాలను వివరించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

పట్టించుకోని ఎస్వీ కోఆపరేటివ్ సొసైటీ అధికారులు

రోడ్లపైనే డ్రమ్ములు.. రాకపోకలకు ఇబ్బందులు



ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీలో రోడ్డుపై కుప్పలుగా ప్లాస్టిక్ వ్యర్థాలు



గంపలబస్తీ రోడ్డుపై ఉంచిన డ్రమ్ములు

జీడిమెట్ల: రహదారులపై ఎక్కడ పడితే అక్కడ ప్లాస్టిక్ డ్రమ్ములు దర్శనమిస్తున్నాయి.ఆయా రీసైక్లింగ్ పరిశ్రమల యజమానులు యథేచ్ఛగా వాటిని నిలిపి ఉంచడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇదేమిటని ఎవరైనా వాహనదారులు, స్థానికులు ప్రశ్నిస్తే 'ఇష్టం వచ్చినకాడ చెప్పుకోండి'అంటూ దురుసుగా సమాధానం ఇస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇదీ ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీ,గంపల బస్తీల్లోని రోడ్ల దుస్థితి. రోడ్లకు అడ్డంగా డ్రమ్ములు ఉంచడంతో వాటి నుంచి రసాయనాల ఘాటు వాసన వెలువడుతోందని, భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రీసైక్లింగ్ పరిశ్రమల యజమానులు రోడ్డుపైన డ్రమ్ములను డంప్ చేయడమే కాకుండా అక్కడే ఇష్టారాజ్యంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. కొన్ని రోడ్లను అయితే బ్లాక్ చేసి కేవలం వారి సొంతానికే వాడుతున్నారు. ఆ రహదారులపైకి వెళ్లడానికి వాహనదారులు జంకుతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది.

◆ రోడ్లపై డంపింగ్ విషయమై ఇప్పటికే కొంతమంది స్థానికులు ఎస్వీ కోఆపరేటివ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకుండా వారికే వత్తాసు పలుకుతున్నారని ప్రజలు అంటున్నారు. అనుమతులు లేని ఈ రీసైక్లింగ్ పరిశ్రమల పట్ల కఠినంగా వ్యవహరించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల మెరుగుకు కృషి

ఎంపీ ఈటల రాజేందర్



దుండిగల్: ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. భౌరంపేట్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న నీటి సమస్యపై కౌన్సిలర్ పీసరి బాలమణి ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన పాఠశాల ఆవరణలో బోరు వేసేందుకు ఎంపీ లాడ్స్ నిధులను కేటాయించారు. శనివారం పాఠశాలను సందర్శించిన రాజేందర్ బోరు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు ఇబ్బందులు తలెత్తకుండా స్కూల్ కమిటీ సభ్యులతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. విద్యార్థుల ఆటస్థలానికి ఐదు ఎకరాలు కేటాయించేలా చర్యలు తీసుకుంటానని ఎంపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జి మల్లారెడ్డి, పీసరి కృష్ణారెడ్డి, నల్ల రామచంద్రారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సర్గారి సత్తిరెడ్డి, నర్సింహాచారి, ప్రశాంత్, వీరేష్ కుమార్, రోజా, సీతారామిరెడ్డి, అశోక్, మన్మోహన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం అందుబాటులో ఉంటాం: ఎమ్మెల్సీ



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన నాయకులు

దుండిగల్: ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్తున్నామని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటామని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. శనివారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని కార్యాలయంలో పలు కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగు పరచాలని విన్నవించగా అయన సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఆయన ప్రజాసమస్యలను ఎప్పటికప్పు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో మోసం.. వ్యక్తి అరెస్టు



నిందితుడు గుర్రం భార్గవ్

కుత్బుల్లాపూర్: ఆన్‌లైన్ మోసానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్ అయిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లికి చెందిన గౌతమ్ న్యూరో కేర్ సీఈవో శశిధర్‌గౌడ్‌కు ఈ నెల 23న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి తనను న్యూరోసర్జన్ గోపాల్‌గా పరిచయం చేసుకున్నాడు. తన అంకుల్‌కు యాక్సిడెంట్ అయిందని, తన ఫోన్‌పే డైలీ బ్యాలెన్స్ దాటిపోయిందని, అంబులెన్స్‌లో మీ ఆస్పత్రికి పంపడానికి 5వేల ఫోన్‌పే చేయాలని నమ్మబలికాడు. నిజమని నమ్మిన శశిధర్‌గౌడ్ అపరిచిత వ్యక్తి తెలిపిన నెంబర్‌కు రూ.5 వేలు పంపాడు. కొద్దిసేపటి తరువాత శశిధర్‌గౌడ్ సదరు వ్యక్తికి ఫోన్ చేసి మా ఆస్పత్రికి ఎవరూ చికిత్స నిమిత్తం రాలేదని తెలపగా అవతలి వ్యక్తి అసభ్య పదజాలంతో మాట్లాడారు. దీంతో తాను మోసపోయాయని గ్రహించిన బాధితుడు పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. దర్యాప్తులో గుంటూరు జిల్లా గరికపాడుకు చెందిన గుర్రం భార్గవ్‌గా గుర్తించిన పేట్‌బషీరాబాద్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా 'రవీంద్రభారతి' వార్షికోత్సవాలు



దుండిగల్: మున్సిపల్ గండి మైసమ్మలోని రవీంద్ర భారతి స్కూల్‌లో వార్షిక వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. సాయంత్రం 5.30 గంటలకు పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమానికి న్యూరాన్స్ గ్రూప్ ఫౌండర్ జాన్ హేమంత్‌కుమార్, రవీంద్రభారతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.రేవంత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, మెమోంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ రాణి, ప్రిన్సిపాల్ అనూష, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పీజేఆర్ చిరస్మరణీయుడు



పీజేఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కూన శ్రీశైలంగౌడ్ తదితరులు

కుత్బుల్లాపూర్: మాజీమంత్రి పి.జనార్దన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. పీజేఆర్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం షాపూర్‌నగర్‌లోని శ్రీశైలంగౌడ్ నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ పీజేఆర్ అనునిత్యం ప్రజల కోసం పరితపించే నాయకుడని, పేదల గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ రాముగౌడ్, మాజీ సర్పంచ్‌లు యాదిరెడ్డి, యాదగిరి, ముత్యంరెడ్డి, పరశురాముల గౌడ్, కుమార్ యాదవ్, మల్లేష్ యాదవ్, కోటేశ్వరరావు, సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భాగ్యరథి కాలేజీ గెట్ టుగెదర్



ప్రతిభ కనబరిచిన విద్యార్థి, తల్లిదండ్రులను సత్కరిస్తున్న భాగ్యరథి కాలేజీ యాజమాన్యం



సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఇస్తున్న భాగ్యరథి జూనియర్ కళాశాల విద్యార్థులు

రంగారెడ్డినగర్: చింతల్ భాగ్యరథి జూనియర్ కళాశాల గెట్ టుగెదర్ కార్యక్రమం శనివారం గాంధీనగర్‌లోని ఎస్ఆర్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, డైరెక్టర్ వెంకట్‌రెడ్డి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు విద్యార్థులకు పలు విలువైన సూచనలు చేశారు. జీవిత లక్ష్యాలు, కెరీర్ సాధన, విజయవంతమైన జీవితాన్ని నిర్మించుకోవడానికి సరైన మార్గదర్శకత్వం అవసరమన్నారు. పలువురు విజేతల విజయ గాథలతో విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. నీట్ పరీక్షల్లో 5 వేల లోపు ర్యాంక్‌లు సాధించే విద్యార్థులకు రూ.25 వేల ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని, ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో టాపర్‌గా నిలిచిన విద్యార్థుల ఫీజులు మాఫీ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి డైరెక్టర్లు నల్ల జైశంకర్‌గౌడ్, రమేష్ బాబు, రామకృష్ణ, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిశువు మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆందోళన

కుత్బుల్లాపూర్: వైద్యుల నిర్లక్ష్యం వల్లే శిశువు మృతి చెందిందని కుటుంబసభ్యులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన దిగిన ఘటన పేట్‌బషీబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మెదక్ జిల్లా తుప్రాన్ మండలం మనోహరాబాద్‌కు చెందిన ప్రభాకర్, జ్యోతి భార్యాభర్తలు. ఈ నెల 25న జ్యోతి పురిటినొప్పులతో కొంపల్లిలోని సురేఖ ఆస్పత్రిలో చేరింది. 26న పురిటినొప్పులు ఎక్కువగా కావడంతో ఆపరేషన్ థియేటర్‌కు తీసుకువెళ్లగా వైద్యులు లేకపోవడం, నర్సులు పట్టించుకోకపోవడంతో ఆస్పత్రి ఆవరణలోనే జ్యోతి శిశువుకు జన్మనిచ్చింది.అయితే శిశువు ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుటుంబసభ్యులు మరో పిల్లల ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో శిశువు చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో ఆస్పత్రి వైద్యులు నిర్లక్ష్యం వల్లే శిశువు మృతి చెందిందని బంధువులు కొంపల్లిలోని సురేఖ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు వారికి నచ్చజెప్పి అక్కడ నుంచి పంపించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రి యాజమాన్యంలో బాధిత కుటుంబానికి నష్టపరిహారం ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకుందని సమాచారం.

ఆలయ వార్షికోత్సవం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ ఎం.ఎన్.రెడ్డినగర్‌లోని శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ 16వ వార్షికోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ సందరి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో రుద్రహోమం, చండీహోమం, పూర్ణాహుతి, శివకల్యాణం, ఋత్విక్ సన్మానాలు నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పణ చేశారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

జీడిమెట్ల: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలిగితేనే వారిని రౌడీషీట్స్ నుంచి మినహాయింపు ఇస్తామని బాలానగర్ ఏసీపీ హనుమంతరావు అన్నారు. శనివారం జీడిమెట్ల పిఎస్ పరిధిలని పలువురు రౌడీషీటర్ లను స్టేషన్‌కు పిలిపించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ ఇప్పటికైనా రౌడీషీటర్లు సమాజంలో గౌరవ మర్యాదలతో మెలగాలని సూచించారు. మొత్తం 36 మంది రౌడీషీటర్లు ఉండగా, 26 మంది హాజరయ్యారు. మరి కొంతమంది జైల్లో ఉన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

నిజాంపేట్: సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు కార్పొరేట్‌స్థాయి వైద్య సేవలు అందుతున్నాయని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. శనివారం బాచుపల్లిలోని పార్టీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు ఆయన చెక్కులు అందజేశారు. దుండిగల్ మున్సిపల్, గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిళ్లకు చెందిన సుజాత, వెంకమ్మ, కృష్ణ, షేక్ నూరిస్సా, శ్రీలతలకు రూ.60 వేల చొప్పున, నరేష్‌కు రూ.40 వేలు, లలితకు రూ.47.5 వేల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయించామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ధమ్మని శ్రవణ్‌కుమార్, నాయకులు పాలకృష్ణ, జేమ్స్, మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, సంజీవరెడ్డి, శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు



పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

జగద్గిరిగుట్ట: ప్రజా సమస్యలపై పోరాటం బీజేపీతోనే సాధ్యమవుతుందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం ఆ పార్టీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ జేకే శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో పలు పార్టీ నాయకులు ఎంపీ రాజేందర్ సమక్షంలో బీజేపీ గూటికి చేరారు. జగద్గిరినగర్ బస్తీ అధ్యక్షుడు జగన్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి ముత్యాలు, ఉపాధ్యక్షుడు యాదిగిరి రాజు, కోశాధికారి బిక్షపతి, కమిటీ సభ్యులు సుధాకర్ రవి రాజు, రమేష్, జగదీష్ శ్రీధర్‌లను ఈటల రాజేందర్ పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి సురేష్ రెడ్డి, డివిజన్ ఉపాధ్యక్షుడు గండి రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారమే ధ్యేయం: మదన్ గౌడ్



ముద్దాపురం మదన్ గౌడ్‌ను సన్మానిస్తున్న కార్మికులు

కుత్బుల్లాపూర్: కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతానని శ్రమశక్తి అవార్డు గ్రహీత, బీఆర్ఎస్‌కేవీ నాయకుడు ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. సంగారెడ్డి ప్రాంతంలోని రామచంద్రపురం టీబువల ఎలక్ట్రానిక్స్ యూనిట్‌లో కార్మిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో ఆయన అధ్యక్షుడిగా గెలుపొందారు. 60 మంది ఓట్లు పోలుకాగా, 31 ఓట్లు మదన్ గౌడ్‌కు రాగా, సీఐటీయూ తరఫున పోటీ చేసిన మల్లికార్జున్‌కు 29 ఓట్లు వచ్చాయి. రెండు ఓట్ల మెజార్టీతో మదన్‌గౌడ్ విజయం సాధించారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసానికి కార్మికులు తరలివచ్చి ఘనంగా సన్మానించారు. అంతకుముందు కంపెనీ ప్రధాన గేటు ముందు జరిగిన సమావేశంలో ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ యాజమాన్యాలతో పోరాడి కార్మికుల హక్కుల పరిరక్షిస్తున్నందునే కార్మికులు తనను మరోసారి గెలిపించారని అన్నారు.

పీఆర్‌టీయూటీఎస్ కేలండర్ ఆవిష్కరణ



నిజాంపేట్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూటీఎస్ నిరంతరం పని చేస్తుందని బాచుపల్లి మండల శాఖ అధ్యక్షుడు నర్సింహులు అన్నారు. శనివారం నిజాంపేట్ స్కూల్‌లో పీఆర్‌టీయూటీఎస్ నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం బాచుపల్లి మండల ప్రధాన కార్యదర్శి ప్రమోద్‌కుమార్, వెంకటేశ్వరరావు, మహిళా వైస్ ప్రెసిడెంట్ సుమతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిజాంపేట్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం: వివేకానంద్



రాజీవ్ గాంధీనగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో గత పదేళ్లలో కోట్లాది రూపాయలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, కార్పొరేషన్‌లో మౌలిక వసతుల కల్పనకు అధిక నిధులు కేటాయించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శనివారం నిజాంపేట్‌లోని 15వ డివిజన్‌లో కార్పొరేటర్ సుజాతతో కలిసి ఆయన పర్యటించారు. పత్తికుంట చెరువు వద్ద ధోబీఘాట్ నిర్మాణం, క్రిస్టియన్ గ్రేవ్ యార్డులో ప్రహరీ, బోర్‌వెల్ వసతి కల్పించాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్థానిక కార్పొరేటర్, ప్రజల నుంచి సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజీవ్ గాంధీనగర్‌లో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకుంటానని అన్నారు. అభివృద్ధి పనుల కోసం ప్రణాళికలు రూపొందించి వెంటనే పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, కమిషనర్ సబేర్ అలీ, డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాసు, కార్పొరేటర్లు ఆగం రాజు, బొర్రచందు దేవి, బాలాజీ నాయక్, రవికిరణ్, ఏఈ ప్రవీణ్, వాటర్ వర్క్స్ డీజీఎం చంద్రమౌళి, మేనేజర్ సౌమ్య, ఎన్విరాన్‌మెంట్ ఏఈ సుకృతారెడ్డి, సర్వేయర్ లక్ష్మి,బీఆర్ఎస్ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హిల్‌కౌంటీ వాసులతో సమావేశం..

బాచుపల్లిలోని హిల్ కౌంటీ కాలనీవాసులతో ఎమ్మెల్యే వివేకానంద్ సమావేశమై సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా చెత్త డంపింగ్ యార్డు సమస్యను కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ భూమిలో వ్యర్థాలు డంపింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా హిల్‌కౌంటీ కాలనీ నూతన కార్యవర్గం ఎమ్మెల్యేను సన్మానించారు. నూతన అపార్ట్‌మెంట్ ఓనర్స్, మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా రామక్రిష్ణ, వైస్ చైర్మన్ పరిమళ, జనరల్ సెక్రటరీ దిబాకర్ పాణిగ్రహి, జాయింట్ సెక్రటరీ ప్రమోద్ బెన్సన్, కోశాధికారి ధనుంజయ, సంయుక్త అధికారి బుద్ధే ప్రసన్న, డైరెక్టర్లుగా కె.వి.సుబ్బరాజు, ఆచారి హిమబిందు, సాగి అజయ్ కుమార్, అమిత్ జైస్వాల్, మాలతి వర్మ, సీవీఎస్ రామక్రిష్ణ ఎన్నికయ్యారు. కార్యవర్గాన్ని ఎమ్మెల్యే వివేకానంద్ అభినందించారు.